సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 13 । జూన్ । 2023



ఈదురుగాలుల బీభత్సం

మన్యంలో పలు చోట్ల సోమవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 8లో



నాణ్యతగా ఉపాధి పనులు

ఉపాధి హామీ పనుల్లో నాణ్యతలు పాటించాలి.పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఐటీడీఏ పీవో అభిషేక్ చెప్పారు. 8లో

న్యూస్‌రీల్

క్రీడాకిట్లు పంపిణీ



క్రీడాకిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ముగియడంతో శిక్షకులకు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. గత నెల 10వతేదీ నుంచి ఈనెల 10వతేదీ వరకు జిల్లాలోని పలుప్రాంతాల్లో 50 క్రీడా శిబిరాలను విజయవంతంగా నిర్వహించి, విద్యార్థినీవిద్యార్థులకు క్రీడల్లో మంచి శిక్షణ ఇచ్చిన జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్‌మోహన్‌రావు,ఇతర శిక్షకులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి: మండలంలోని పెదబరడ ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెచ్ఎం కె.బాలన్న తెలిపారు. ఈనెల 31నలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 3 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. వసతి గృహంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, జగనన్న విద్యా కానుక కిట్లతో పాటు మెరుగైన విద్యా బోధన అందిస్తామని చెప్పారు.ఆసక్తి గల విద్యార్థులు ఫోన్‌నంబర్ 8332936703లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు



వై.రామవరం పోలీసుస్టేషన్ వద్ద పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42– బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం అందజేశారు. మండల కేంద్రంలోని వారపు సంత, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 210 మందికి భోజన ప్యాకెట్లు పంపిణీ చేసి, మంచినీటి సదుపాయం కల్పించినట్టు బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు చెప్పారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

20 ఏళ్ల తరువాత.. పూర్తిస్థాయి టీచర్లు



విధులకు హాజరైన ఉపాధ్యాయులు

సీలేరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 20 సంవత్సరాల తరువాత పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల నియామకం జరిగింది. ఇటీవల జరిగిన బదిలీల్లో సీలేరుకు ఏడుగురు ఉపాధ్యాయులను పంపారు. దీంతో ఇక్కడ ఉపాధ్యాయుల సంఖ్య 13కు పెరిగింది. త్వరలో హిందీ ఉపాధ్యాయుడు వచ్చే అవకాశం ఉంది. 20 ఏళ్ల తరువాత పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం పి.జగ్గారావు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యనందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని చెప్పారు.

మైనర్ ఇరిగేషన్ ఈఈగా సుబ్బయ్య



రాజవొమ్మంగి: మైనర్ ఇరిగేషన్ రెగ్యులర్ ఈఈ గా కె.సుబ్బయ్య రంపచోడవరంలో సోమవారం విధుల్లో చేరారు. కాకినాడ డ్రైయినేజీ డివిజన్ ఈఈగా పనిచేస్తు ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఈఈగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి వెల్లిగల్లుప్రాజెక్టు (కడప)కు బదిలీ అయ్యారు.

విశాఖ-తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నంలో సోమవారం బయల్దేరాల్సిన విశాఖపట్నం-తిరుపతి (08583) స్పెషల్‌ను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన ఈ రైలు సుమారు 4 గంటలఆలస్యంగా రాత్రి 11.10 గంటలకు విశాఖలో బయల్దేరింది. అటు నుంచి రావలసిన పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలును రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఖరీఫ్ పండాలి.. కష్టమంతా తీరాలి

వాతావరణం అనుకూలించింది.. పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం జమచేయడంతో అదే ఉత్సాహంతో గిరి రైతులు ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. నారు మళ్లు సిద్ధం చేస్తున్నారు. కష్టమంతా తీరేలా... పంటలు పండాలని కోరుకుంటూ రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండడంతో పండగ వాతావరణం నెలకొంది.





పాడేరు మండలం జి.ముంచంగిపుట్టులో ట్రాక్టర్‌తో దుక్కిపనులు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) జి.మాడుగుల మండలం కులుపాడులో వరినారుమడులు

- దుక్కి పనుల్లో గిరిజన రైతులు బిజీ
- ఉత్సాహంగా నారుమళ్లు తయారీ

సాక్షి,పాడేరు : జిల్లాలోని ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 2,62,667 ఎకరాల విస్తీర్ణంలో పంటలు పండిస్తుండగా, ఇందులో 1,49,517 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మిగిలిన 1,13,150 ఎకరాల్లో వాణిజ్య, చిరుధాన్యాల పంటలను సాగు చేస్తున్నట్టు ఈక్రాప్ నివేదిక ద్వారా తెలుస్తోంది. మొదటి, రెండవ దుక్కి పనులతో పాటు నారు మడులు తయారీలోను గిరిజన రైతులు బిజీగా మారారు.ఎక్కడ చూసిన గిరిజన రైతులు పంట భూముల్లో దుక్కి,నారుమడుల తయారీలో ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. యంత్రాలతో పనులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ట్రాక్టర్లతో దుక్కులు చేపడుతున్నారు. ఇప్పటికే 90శాతం దుక్కులు పూర్తయ్యాయి.రాష్ట్ర ప్రభుత్వం గిరిజన రైతాంగానికి ఈఏడాది కూడా ఖరీఫ్‌లో 90శాతం సబ్సిడీపై మేలుజాతి వరి విత్తనాలతో పాటు, రాగులు, పచ్చిరొట్ట, జనుము విత్తనాలను అందుబాటులో తెచ్చింది. అన్ని ఆర్‌బీకేల ద్వారా 90శాతం సబ్సిడీ పై విత్తనాలు అందజేస్తోంది. సబ్సిడీ విత్తనాలు గిరిజన రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి.

ఆశాజనకంగా నారుమడులు

పాడేరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లోను వ్యవసాయపనులకు గిరిజన రైతులు ముందస్తుగానే శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ నుంచే వర్షాలు పడుతుండడంతో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఏప్రిల్ 2వ వారంలో వేసవి దుక్కులను చేపట్టారు. ప్రస్తుతం మెట్ట భూముల్లో వాణిజ్య, చిరుధాన్యాల పంటల సాగు పనులు 75శాతం పూర్తయ్యాయి. చిరుధాన్యాలు, వేరుశనగ పంటలు మొక్క దశలో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం వరి నారు మడులు తయారీలో గిరిజనులు బిజీగా ఉన్నారు. ముందస్తుగా వేసిన నారు మడులు ఆశాజనకంగా ఎదుగుతున్నాయి. వచ్చే వారం వరి నాట్ల వేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖరీఫ్‌లో పంటల సాగు వివరాలు (హెక్టార్లలో)

వరి	59,807
రాగులు	17,600
చిరుధాన్యాలు	5,596
జొన్నలు	322
గంటెలు	123
మొక్కజొన్న	5,400
కందులు	1,339
పెసలు	264
మినుములు	1,128
వేరుశనగ	1,253
పత్తి	5,499
మిరప	318
చెరకు	180
పొగాకు	274
పసుపు	5,259

ఆర్బీకేల ద్వారా విత్తనాల పంపిణీ



వ్యవసాయ రంగానికి మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్బీకేల ద్వారా వరితో పాటు రాగులు, ఇతర విత్తనాలను 90శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నాం. రైతులకు అవసరమైన వరి విత్తనాలనే పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలిచ్చింది. ఖరీఫ్‌కు సంబంధించి తమ వ్యవసాయ అసిస్టెంట్ల ద్వారా గిరిజన రైతులకు అన్ని విధాల సహకరిస్తున్నాం. నారుమడుల తయారీలోను తగిన సలహాలు,సూచనలు ఇస్తున్నారు.

– ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో 2వేలకు పైగా సెల్ టవర్లు

- కలెక్టర్ సుమిత్ కుమార్



భీమవరంలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

హుకుంపేట: మారుమూల గ్రామాల్లో సైతం సెల్ సిగ్నల్స్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని, జిల్లా వ్యాప్తంగా రెండు వేలకుపైగా సెల్ టవర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మండలంలోని భీమవరంలో సోమవారం ఆయన పర్యటించారు. ముందుగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల ఏర్పాటు చేసిన జియో సెల్ టవర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సెల్ సిగ్నల్స్ లేక జిల్లా ప్రజలు సమస్యలను ఎదుర్కొనే వారని, అత్యవసర పరిస్థితుల్లో కనీసం 108కు సమాచారం ఇవ్వలేని పరిస్థితులుండేవని చెప్పారు. దానిని అధిగమించేందుకు అన్ని ప్రాంతాల్లో సెల్ టవర్ల నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుపూర్తయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి,ఎంపీడీవో వెంకటరావు,గిరిజన సంక్షేమ శాఖ ఏఈఈ ధృవకుమార్,సర్పంచ్ సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ విద్యార్థుల భవితకు పునాది

- ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయాలి
- జగనన్న విద్యా కానుక కిట్లలో నాణ్యమైన సామగ్రి పంపిణీ
- కలెక్టర్ సుమిత్ కుమార్



జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు,ఇతర ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థుల ఉన్నత భవితకు పునాది అని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. స్థానిక కుమ్మరిపుట్టు గిరిజన సంక్షేమశాఖ గురుకుల విద్యాలయంలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. జిల్లాలోని 2,910 పాఠశాలలకు సంబంధించి 1,66,709 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఎంపీపీ ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి కలెక్టర్ జేవీకే కిట్లు పంపిణీ చేశారు. బ్యాగుల్లోని నాణ్యమైన బూట్లు,యూనిఫాం క్లాత్, పుస్తకాలు,ఇతర సామగ్రిని చూసి విద్యార్థులు,ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తోందని, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించిందన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను నియమించిందని చెప్పారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు కృషి చేయాలన్నారు.గిరిజన ప్రాంతం కావడంతో ఉపాధ్యాయుల బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని,తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులకు తగిన సహకారం అందించాలన్నారు.

విద్యార్థుల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విలువైన సామగ్రితో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా విదేశాల్లో విద్య,ఉద్యోగాలు పొందే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు పోటీతత్వంతో బాగా చదువుకోవాలన్నారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి,చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ,ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి,మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డీఈవో సలీమ్‌బాషా,ఏటీడబ్ల్యువో రజనీ,ఎంఈవో సరస్వతి,సర్పంచ్‌లు సీదరి రాంబాబు,లకే పార్వతమ్మ,ఎంపీటీసీ లకే రామకృష్ణపాత్రుడు,వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్టగుళ్లి నాగేంద్ర, మోద బాబురావు, కోడా సుశీల, ఐశ్వర్యరాణి తదితరులు పాల్గొన్నారు.

సందడి సందడిగా..



పాడేరు ఏపీఆర్ స్కూలుకు వస్తున్న విద్యార్థినులు



బిల్లాపుట్టు పాఠశాలను సందర్శించిన ఎంఈవో రామచంద్రరావు

- జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం
- ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: వేసవి సెలవుల అనంతరం జిల్లాలో బడులు తెరుచుకున్నాయి. 2023–24 విద్యా సంవత్సరం తరగతులు సోమవారం నుంచి మొదలయ్యాయి.దీంతో పాఠశాలలన్నీ విద్యార్థులతో సందడిగా మారాయి. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తొలిరోజు ఉదయం 11.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలను నిర్వహించారు. ఈ నెల 17 వరకు ఒంటి పూట బడులు కొనసాగుతాయి. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2,975 పాఠశాలలున్నాయి. ఉదయం 7.30గంటలకు పాఠశాలలు తెరిచారు. ఉదయం 9 గంటలోపు విద్యార్థులకు రాగి జావ ఇచ్చారు. అదే విధంగా 11.30 గంటల తరువాత భోజనం పెట్టి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలకు సంబంధించి తొలిరోజు భారీగా విద్యార్థినీవిద్యార్థులు హాజరయ్యారు. అన్ని మండలాల ఎంఈవోలు,సీఆర్‌పీలు పాఠశాలలను తనిఖీ చేశారు. భోజన,వసతి సౌకర్యాలు ఉన్న కేజీబీవీలు,గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు,గురుకుల విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను పూర్తి స్థాయిలో నిర్వహించారు. జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీని ఉపాధ్యాయులు పండగలా చేపట్టారు.

200 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

చింతపల్లి: మండలంలోని అన్నవరంలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమేష్, ఎస్ఐ రమణ అందించిన వివరాలు మేరకు...అన్నవరం వంతెన వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై పైలెట్‌గా వచ్చిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యారు. వెంటనే వారిని పోలీసులు పట్టుకుని ఆరా తీస్తుండగా వెనుక రెండు కార్లు వచ్చాయి. పోలీసులను చూసి కార్లలో ప్రయాణిస్తున్నవారు కూడా పారిపోయే ప్రయత్నం చేశారు. ఒక కారులోఉన్న గోపిల్లి నవీన్, రుత్తుల బోడకొండ అనే ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వీరిని విచారించగా గంజాయి రవాణా చేస్తున్నట్టు తెలిపారని, పైలట్లుగా వ్యవహరించిన ఇద్దరు , మరో ముగ్గురు కలిపి మొత్తం ఐదుగురు పరారయ్యారని సీఐ, ఎస్ఐలు చెప్పారు. ఒక్కో కారులో 100 కిలోల చొప్పున రెండు కార్లలో 200గంజాయి తరలిస్తున్నట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి గంజాయి, రూ 2 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, పరారైన వారి కోసం గాలిస్తున్నామని సీఐ,ఎస్ఐ చెప్పారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

- ఐటీడీఏ పీవో అభిషేక్



జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్,అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ: చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులందరూ కష్టపడి చదవాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. స్థానిక కంతబంసగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో సోమవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి ఆయన విద్యార్థులకు జేవీకే కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారంతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులంతా బాగా చదువుకుని తల్లిదండ్రులు,ఉపాధ్యాయులకు పేరు తేవాలన్నారు.

ఈకార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అశుతోస్ శ్రీవాత్సవ,ఎంపీపీ ఆర్.ఉషారాణి,ఎంపీటీసీ ఎల్.బి. భీమరాజు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ఎంఈవో భారతి రత్నం,వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి వెంకటరావు,శెట్టి అప్పాలు,గెమ్మెలి బాబురావు,ఎల్.బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

‘మీ చూపులే’ లఘు చిత్రానికి రెండు అవార్డులు

- రోషని అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏజెన్సీ కళాకారుడి ఘనత
- ఉత్తమ నటుడు, దర్శకునిగా అవార్డులు అందుకున్న రాఘవ









వెంకటరాఘవ అందుకున్న అవార్డు, లఘు చిత్రంలో నటులు

కొయ్యూరు: ఓ గిరిజన యువకుడు లఘు చిత్రాలను తీయడంలో ప్రతిభను కనబరచి పేరు తెచ్చుకుంటున్నాడు. కొమ్మికకు చెందిన ఎస్.వెంకటరాఘవ కొన్ని సంవత్సరాల నుంచి లఘు చిత్రాలను తీస్తున్నారు. తాజాగా ఆయన దర్శకత్వం వహించి, నటించిన ‘మీ చూపులే’ లఘు చిత్రానికి రోషని అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్(ఆర్ఐఎఫ్ఎఫ్)లో రెండు అవార్డులు లభించాయి. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు కేటగిరీల్లో ఆయన ఈ అవార్డులను సొంతం చేసుకున్నారు. మే 31న లఘు చిత్రాలను రోషని బృందం చూసింది. ఈనెల రెండున ‘మీ చూపులే’ చిత్రం రెండు కేటగిరీల్లో అవార్డులకు ఎంపికైనట్టు ప్రకటించారని దర్శకుడు వెంకటరాఘవ సోమవారం విలేకరులు తెలిపారు. రెండు విభాగాల్లో అవార్డులను రావడం ఆనందంగా ఉందన్నారు. గతంలో తాను చిత్రీకరించిన పీఆర్ఎస్ చిత్రం కూడా ఉత్తమ చిత్రంగా ఎంపికై ందన్నారు. ఇప్పటి వరకు ఐదు లఘు చిత్రాలు ఉత్తమమైనవిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

బీడీ ఆకు.. ఆదాయం భేష్

- ఈ ఏడాది 66 శాతం తునికాకు సేకరణ
- ఆదివాసీలకు చేకూరిన అదనపు ఆదాయం



తునికాకు సేకరిస్తున్న ఆదివాసీలు

చింతూరు: మన్యంలోని ఆదివాసీలకు వేసవిలో అదనపు ఆదాయం సమకూర్చి పెట్టే తునికాకు(బీడీ ఆకు) సేకరణముగిసింది. చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం,ఎటపాక,వీఆర్‌పురంమండలాల్లో సుమారు 15 రోజుల పాటు తునికాకు సేకరణ జోరుగా సాగింది. తునికాకు సేకరణ ద్వారా ఈవేసవిలో ఆదివాసీ కుటుంబాలకు మంచి ఆదాయం లభించింది. గత మూడేళ్లుగా అంతంత మాత్రంగా సాగిన తునికాకు సేకరణ ఈ ఏడాది మెరుగుపడింది. చింతూరు అటవీ డివిజన్‌లోని తొమ్మిది యూనిట్లలో 261 తునికాకు కల్లాలున్నాయి.

సేకరణ పెరింగిందిలా

50 తునికాకులను ఒక కట్టగా, వెయ్యి కట్టలను ఒక స్టాండర్డు బ్యాగుగా పరిగణిస్తారు. 2019లో జరిగిన తునికాకు సేకరణలో 45 శాతం మేర మాత్రమే లక్ష్యాన్ని సాధించగా ఈ ఏడాది 66 శాతానికి పెరిగింది. ఈ ఏడాది 86 కల్లాల ద్వారా తునికాకు సేకరణ నిర్వహించడంలో భాగంగా 12,500 స్టాండర్డు బ్యాగుల లక్ష్యాన్ని నిర్దేశించగా 8,132 స్టాండర్డు బ్యాగుల సేకరణ సాధ్యమైంది. గతంలో 50ఆకుల కట్టకు రూ.2 చెల్లించగా, ధర పెంచి ఈ ఏడాది రూ.3 చెల్లించారు.ఈ ఏడాది చింతూరుయూనిట్లో లక్ష్యానికి మించి తునికాకు సేకరణజరిగింది. ఈయూనిట్లో 1,500 స్టాండర్డు బ్యాగులు లక్ష్యంకాగా 2,627స్టాండర్డు బ్యాగుల తునికాకుసేకరణ జరిగింది.

లక్ష్యసాధన కోసం.. :చింతూరు డివిజన్లో ప్రతి ఏడాది తునికాకు సేకరణ శాతం తగ్గుతుండడంతో అటవీ అధికారులు ఈ ఏడాది లక్ష్యసాధనపై దృష్టి సారించారు. ప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు ఆదివాసీలకు అదాయంసమకూర్చేందుకు వారు తునికాకు సేకరణ ఆవశ్యకతను కార్మికులకు వివరించారు. దీంతో గతంలో 50 శాతం మించని తునికాకు సేకరణ ఈ ఏడాది 66 శాతానికి పెరిగింది.

చింతూరు అటవీ డివిజన్‌లో తునికాకు సేకరణ, సాధించిన లక్ష్యం ఇలా

రేంజ్	యూనిట్ పేరు	కల్లాల సంఖ్య	స్టాండర్డు బ్యాగుల లక్ష్యం	సాధించిన లక్ష్యం
నెల్లిపాక	నెల్లిపాక	38	1,200	385
నెల్లిపాక	మాధవరావుపేట	30	1,500	559
కూనవరం	ఏడుగురాళ్లపల్లి	49	3,500	1,315
కూనవరం	కూనవరం	24	1,400	1,168
వీఆర్‌పురం	వీఆర్‌పురం	24	700	746
చింతూరు	చింతూరు	27	1,500	2,627
చింతూరు	కుందులూరు	30	1,000	293
లక్కవరం	లక్కవరం	17	1,200	1,034

రూ.77 లక్షలు చెల్లింపు

ఈ ఏడాది తునికాకు సేకరణ పెరగడం సంతోషంగా ఉంది. ఈ ఏడాది తునికాకు సేకరణకు సంబంధించి రూ 2.44 కోట్లు కార్మికులకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికి రూ.77 లక్షలు చెల్లించాం. మిగతా సొమ్మలను త్వరలోనే చెల్లిస్తాం.

– పుష్పసౌజన్య, డీఎఫ్‌వో, చింతూరు

క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవా లని ప్రిన్సిపాల్ ఆర్.శిరీష కోరారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, సీఎస్ఈ గ్రూపులు ఉన్నాయన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో తెలుగు మీడియంతో పాటు ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉందన్నారు. కళాశాలలో చేరిన విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహ సదుపాయం ఉందని పేర్కొన్నారు. రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్.శిరీష నూతనంగా విధుల్లో చేరారు.

ద్విచక్రవాహనం దిగుతూ రోడ్డుపై పడి...

నర్సీపట్నం : ద్విచక్రవాహనం దిగుతుండగా ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడి తలకు గాయమై మృతి చెందింది. టౌన్ సీఐ ఎస్.గణేష్ అందించిన వివరాలివి. మున్సిపాలిటీ పరిధి అయ్యన్నకాలనీకి చెందిన వి.సావిత్రి(75) ఆరోగ్యం బాగలేకపోవడంతో ఆస్పత్రిలో చూపించుకునేందుకు నర్సీపట్నం నడిచి వస్తోంది. మార్గం మధ్యలో తెలిసిన వ్యక్తి అటుగా వస్తున్న బైక్‌ను ఆపి వృద్ధురాలిని ఎక్కించాడు. నర్సీపట్నం రాగానే ఆమె బైక్ దిగుతుండగా ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడిపోయింది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

కె.కోటపాడు : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి భార్య మందలించిందన్న మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎ.కోడూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాలివి. ఎ.కోడూరు గ్రామానికి చెందిన బొడ్డు అవతారం (40) మద్యానికి బానిసై నిత్యం మద్యం సేవించడంతో భార్య ముత్యాలమ్మ సోమవారం మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన అవతారం పురుగుమందు తాగాడు. భర్త అపస్మాకర స్థితిలో ఉండడాన్ని గమనించిన భార్య కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకెళ్లింది. అక్కడ ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అవతారం మృతి చెందాడని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఈదురుగాలుల బీభత్సం



సూరంపాలెం సమీపంలో ప్రధాన రహదారిపై కూలిన చెట్టు



కొయ్యూరు కాకరపాడులో స్తంభంపై కూలిన చెట్టు

అనంతగిరి: మన్యంలో కొన్నిచోట్ల సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ లైన్‌లపై చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. అరకు– విశాఖ రహదారిపై వర్షపునీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు గ్రామాల్లో భారీగా వర్షాపునీరు చేరింది. శారద, గోస్తనీ నదులు పెద్ద ఎత్తున ప్రవహించాయి.
కొయ్యూరు: ఈదురుగాలులకు మండలంలోని కాకరపాడులో చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సింగారంలో విద్యుత్ స్తంభం నేల కొరిగింది. కొత్త స్తంభాన్ని సిబ్బంది తీసుకొచ్చినా చీకటికావడంతో పనులు చేసే అవకాశం లేకుండా పోయింది. మంగళవారం వరకు విద్యుత్‌ను ఒక ప్రాంతంలో పునరుద్ధరించే అవకాశం లేదని పలువురు చెబుతున్నారు.



గింజర్తిలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో వ్యాపిస్తున్న మంట

రాజవొమ్మంగి: మండలంలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు రాజవొమ్మంగి శివారున సూరంపాలెం ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలిపోవడంతో నర్సీపట్నం, కొయ్యూరు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని సిబ్బంది, స్థానిక యువకుల సహాయంతో చెట్టును తొలగించారు. తిరిగి రాకపోకలను సాగేలా చర్యలు చేపట్టారు. గింజర్తి గ్రామంలో ఓ వర్షం కురుస్తున్న సమయంలో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు ఎగసి పడ్డాయి. స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పిడుగు ధాటికి కోసూరి సత్యనారాయణ ఇంట్లోని టీవీ కాలిపోయింది. ఎలక్ట్రికల్ వస్తువులు పాడైనట్టు సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి తెలిపారు. ఆస్తి నష్టం సుమారు రూ.40వేలు ఉంటుందని చెప్పారు.

హోంగార్డు దుర్మరణం

- ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదం



భర్త మృతదేహం వద్ద రోధిస్తున్న భార్య హైమ



కుమారస్వామి (ఫైల్)



హోంగార్డు కుమారస్వామి మృతదేహం

అనకాపల్లిటౌన్ : మండలంలోని కాపుశెట్టివానిపాలెంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు సబ్బవరపు కుమారస్వామి (36) మృతి చెందారు. అనకాపల్లి గ్రామీణ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలివి. కుమారస్వామి సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సబ్బవరం రహదారి ఇరువాడలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకుని వచ్చినట్టు ఎస్ఐ చెప్పారు. ఆస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచి సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో అనకాపల్లి నుంచి సబ్బవరం స్టేషన్‌కు వెళుతుండగా కాపుశెట్టివానిపాలెంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన నిర్మించిన కాలువలో పడిపోయింది. దీంతో కుమారస్వామి అక్కడిక్కడే మృతి చెందారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడి భార్య హైమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

చంద్రయ్యపేటలో విషాదఛాయలు

కె.కోటపాడు : అనకాపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు ఎస్.కుమారస్వామి మృతిచెందడంతో ఆయన స్వగ్రామం చంద్రయ్యపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరితో సరదాగా ఉంటూ, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే కుమారస్వామి మృతి గ్రామస్తులను కలచివేసింది. ఎప్పటిలానే విధులకు వెళ్లిన భర్త సోమవారం ఇంటికి తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న భార్య హైమకు రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందాడన్న సమాచారం తెలిసి భోరున విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. మృతునికి భార్య, 4, 6 ఏళ్ల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రయ్యపేటలో కుమారస్వామి మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. అంతకు ముందు కుమారస్వామి భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం నిర్వహించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు

- యువకుడి దుర్మరణం
- మరొకరు కొన ఊపిరితో ఆస్పత్రిలో పోరాటం



మొల్లి సురేష్ (ఫైల్)

యలమంచిలి : వివాహ వేడుకకు వచ్చి తిరిగి అరగంటలో ఇంటికి చేరుకుంటాం అనుకునే లోపే మృత్యువు వారిని వెంబడించి కబలించింది. యలమంచిలి మండలం రేగుపాలెం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడిపాలెం గ్రామానికి చెందిన ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు కొన ఊపిరితో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలివి. నక్కపల్లి మండలం ఉపమాక పంచాయతీ మామిడిపాలెం గ్రామానికి చెందిన మొల్లి సురేష్ (21), మొల్లి నాగేష్ (16) ఆదివారం కోటవురట్ల మండలం నర్సింగబిల్లిలో ఒక వివాహ వేడుకలో కిల్లీలు సరఫరా చేయడానికి వెళ్లి తిరిగి స్వగ్రామం తమ ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. యలమంచిలి మండలం రేగుపాలెం హైవే జంక్షన్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో మొల్లి సురేష్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నాగేష్‌ను విశాఖలోని కింగ్స్ ఐకాన్ ఆస్పత్రి తరలించారు. ఈ ఘటనతో బంధువులైన ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ బస్సును సీసీ ఫుటేజి సహాయంతో యలమంచిలి రూరల్ పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. సురేష్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



కిల్లో కళ (ఫైల్)

అనంతగిరి : డుంబ్రిగుడ మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామానికి చెందిన వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాలివి. బడిమెల గ్రామానికి చెందిన కిల్లో కళ (31) సోమవారం ఉదయం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికులు అందించిన సమాచారంతో ఎస్ఐ సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కళ మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా లేక హత్య చేశారా? అనే కోణంలోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన కుమార్తెను చిత్రహింసలకు గురిచేసి, అల్లుడే హత్య చేసి ఉంటాడని, మృతురాలి తండ్రి కొర్రా శ్రీరాములు ఆరోపించారు. అల్లుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాణ్యతగా ఉపాధి పనులు

- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయం నుంచి పాడేరు,రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్,సూరజ్ గనోరేతో పాటు అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలు పెంచేందుకు వ్యవసాయ, ఉద్యానవనశాఖలు సహకరించాలన్నారు. వేతనదారుల ఆధార్ నంబర్లను బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయాలని తెలిపారు. ప్రతిపాదనల మేరకు కొత్త పనులు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రంథాలయాల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపాలన్నారు.అటవీ హక్కుపత్రాలు పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలని చెప్పారు.జగనన్న తోడు అర్హులను గుర్తించి, నివేదిక ఇవ్వాలని వెలుగు ఏపీఎంలను ఆదేశించారు.జనన నమోదు ధ్రువీకరణ పత్రాల పంపిణీని త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని,స్వచ్ఛభారత్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి,జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు.చెత్త సంపద కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని,వాటిని వెంటనే నిర్వహించి పంచాయతీల ఆదాయం మెరుగుకు కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ,డ్వామా,డీఆర్‌డీఏ పీడీలు రమేష్‌రామన్,మురళీ,డీపీవో కొండలరావు,డీఎల్‌పీవో కుమార్,ఎల్‌డీఎం రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు వరద సహాయక చర్యలకు వినతి



వీఆర్ పురం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు/వీఆర్ పురం: చింతూరు, వీఆర్ పురం మండల పరిధిలో వరద ముంపు ప్రభావిత గ్రామాల్లో ముందస్తుగా సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చింతూరు ఐటీడీఏ వద్ద ఆందోళన, వీఆర్ పురంలో దీక్ష చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ వరద ముందుస్తు చర్యల్లో భాగంగా ముంపు ప్రాంతాల్లో టార్పాలిన్లు, లైట్ల పంపిణీతో పాటు లాంచీలు, పడవలను ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు పునరావస కేంద్రాలను సిద్ధం చేయాలని, జనరేటర్లు, కిరోసిన్, కొవ్వొత్తులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ మేరకు వీఆర్ పురంలో నాయకులు తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ కారం లక్ష్మి , ఎంపీటీసీ సభ్యుడు పూనెం ప్రదీప్ సర్పంచ్‌లు పులి సంతోష్, సరోజినీ, వెట్టి లక్ష్మి, నాయకులు సత్యనారాయణ, చినబాబు, సత్తిబాబు, సురేష్, శ్రీనివాసరావు, నాగిరెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో (బాలుర-1) 2000-01 లో పదో తరగతి బ్యాచ్‌కు పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. ఏనుగురాయి పంచాయతీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలుసుకున్నారు. అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 85 మంది పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు.

రానున్న రోజుల్లో ప్రతి ఏడాది అందరూ కలవాలని, మన స్నేహితుల్లో ఆపదలో, కష్టాల్లో ఉన్న వారికి సహాయం అందించేందుకు గాను సహాయనిధి ఏర్పాటు చేయాలని అందరూ కలిసి నిర్ణయం తీసుకున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఇతర నాయకులు

- మంత్రి మేరుగు నాగార్జున

పరవాడ: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మండలంలోని దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆయన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి రాష్ట్రంలో ఇటువంటి సంక్షేమ పాలనను ఎన్నడూ చూడలేదన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఓ వర్గానికో, మతానికో ఆపాదించడం సబబు కాదన్నారు. అంబేడ్కర్ అందరి వాడని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.పూర్ణానందశర్మ, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, దళిత నాయకులు బూసి వెంకటరావు, ఎల్వీ రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, యలమంచిలి అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, దేవిరెడ్డి రమణ, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వడదెబ్బకు ఒకరి మృతి



రమణ (ఫైల్)

నక్కపల్లి : మండలంలో పెదతీనార్లలో సోమవారం వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మరణించాడు. కిరాణా వ్యాపారం చేస్తున్న మైలపల్లి రమణ (40) సోమవారం మధ్యాహ్నం దుకాణం మూసి ఇంటికి వెళ్లి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోపే మరణించాడని ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గర్భిణికి డోలీమోత



బూరుగు గ్రామంలోని అటవీ ప్రాంతంలోని గర్భిణిని వైద్యం కోసం డోలీమోతపై తరలిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి: మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరుగు గ్రామానికి చెందిన సోమిల చిన్నమ్మ(25) అనే గర్భిణీను వైద్యసేవల నిమిత్తం మొంటాడలో ఆస్పత్రికి సోమవారం డోలీలో తరలించారు. ఆమెకు వైద్య పరీక్షల కోసం కుటుంబ సభ్యులు బూరుగు గ్రామం నుంచి సరైన రహదారి లేక దట్టమైన అటవీ ప్రాంతంలోని సుమారు 8 కిలోమీటర్లు డోలీమోతపై వాణిజ గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి ఆటోలో వైద్యం కోసం మొంటాడ ప్రభుత్వ ఆస్పత్రికి గర్భిణిని తరలించారు. బూరుగు గ్రామానికి విద్యుత్, రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బూరుగు గ్రామానికి రహదారి, విద్యుత్ సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

అనంతగిరి: అరకులోయ మండల కేంద్రంలో ఏరియా ఆస్పతి వద్ద చిన్న పిల్లల పోషకాహార కేంద్రాన్ని, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అషుతోష్ శ్రీవాస్తవతో కలిసి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. అనేక నూతన కార్యక్రమాలను అమలుచేస్తుందన్నారు. పోషకాహార కేంద్రానికి వచ్చే చిన్నారుల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ నెలల నిండకుండా పుట్టిన పిల్లలు, ఎదుగుదల లోపంతో బాధపడుతున్న చిన్నారులకు మంచి పోషకాహారం అందించాలన్నారు. చిన్నారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలన్నారు. ఆస్పత్రిలో చేరిన వారికి వైద్య సేవలను సిబ్బంది పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పరామర్శ



రామభద్రరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కోటవురట్ల: మండలంలోని ఏటికొప్పాక చక్కెర కర్మాగారం మాజీ చైర్మన్ ఆర్ఎస్ రామభద్రరాజు కుటుంబ సభ్యులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లి సుభద్ర సోమవారం పరామర్శించారు. తంగేడులోని ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. రామభద్రరాజు కుమారుడు సతీష్‌రాజుకు ధైర్యం చెప్పి సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్ఎస్ రామచంద్రరాజు,ఆర్.ఎస్. సత్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, శెట్టి రమణ పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లు అందజేత



జగనన్న విద్యా కానుక కిట్‌లను ఉపాధ్యాయులకు అందజేస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం : విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ఉపాధ్యాయులను సూచించారు. గంగవరంలోని పాఠశాలలను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డితో కలసి సోమవారం ఆయన సందర్శించారు. జగనన్న విద్యా కానుకల కిట్లను ఉపాధ్యాయులకు అందించారు. జగనన్న విద్యా కానుకలను ప్రతీ విద్యార్థికి అందేలా చూడాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు.

పాఠశాలలో అక్రమంగా చెట్లు నరికివేత



నాగయ్యపేట ఎంపీయూపీ పాఠశాలలో ఆవరణలో నరికి వేసిన చెట్లు

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలు చెట్లను స్థానిక తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వేమల కృష్ణ అక్రమంగా నరికించేశాడు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో ఈ విషయం బయటకు రాలేదు. హెచ్ఎం ఆలస్యంగా గుర్తించడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలను పరిరక్షించాల్సిన తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు నరికివేయించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నిలువ నీడనిస్తున్న పచ్చని చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేయించిన కృష్ణ నిర్వాహకాన్ని హెచ్ఎం ఆదిరెడ్డి కృష్ణ మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.రవీంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో సూచన మేరకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేమల కృష్ణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు తహసీల్దార్, ఎంపీడీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో భారీ వేప చెట్టుతో పాటు మరికొన్ని చెట్లు ఉన్నాయి. వీటిని నరికించేసి ఆ కలపను సుమారు రూ.10 వేలకు విక్రయించినట్టు సమాచారం. ఈ విషయంపై ఎంఈవో రవీంద్రబాబును వివరణ కోరగా వేమల కృష్ణపై హెచ్ఎం ద్వారా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేయించామన్నారు.